## ఏఈవోల సంఘం డైరీ ఆవిష్కరణ



నూతన సంవత్సరం డైరీని ఆవిష్కరిస్తున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నంరూరల్, ఫిబ్రవరి 11 : రైతు సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరించటంలో ఏఈవోల పాత్ర ఎంతో కీలకమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం ఏఈవోల సంఘం నూతన సంవత్సరం డైరీని నగరంలోని ఆయన నివాసంలో ఏఈవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాలాల శ్రవణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఏఈవోల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఘనంగా బాలయేసు పుణ్యక్షేత్ర వార్షికోత్సవం



బోధనలు చేస్తున్న కార్డినల్ పూల అంథోనీ

తుర్కయంజాల్, ఫిబ్రవరి 11: మున్సిపాలిటీ పరిధి కమ్మగూడలోని బాలయేసు మహోత్సవం(ఊరి పండుగ) ఆదివారం ఘనంగా జరిగింది. నగరంలోని బోయిగూడ చర్చి నుంచి తేరు ప్రదక్షిణలో భాగంగా బాలయేసు విగ్రహాన్ని ఊరేగింపుగా కమ్మగూడకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ కాకుమాను సునీల్, కో ఆప్షన్ సభ్యులు కాకుమాను మరియమ్మ చిన్నయ్య, చర్చి కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు తేరుకు స్వాగతం పలికారు. అనంతరం కార్డినల్ పూల అంథోనీ బోధనలు చేశారు.ప్రపంచ శాంతికి ప్రజలంతా పాటుపడాలని కోరారు.

## ఉచిత వైద్య పరీక్షలు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 11: నాగోల్ నక్షత్ర హాస్పిటల్ సూట్స్ కేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం జీవీఆర్ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 100 మందికిపై రక్త పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్రెషన్స్ ఓన్లీ లైఫ్ సపోర్ట్ (కాల్స్)పై స్థానికులకు అవగాహన కల్పించి, శిక్షణ ఇచ్చి ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేశామని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ రవీంద్ర తెలిపారు. దీనిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా అత్యవసరస్థితిలో ప్రాణాలను కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జీవీఆర్ కాలనీ ప్రెసిడెంట్ రామ్మోహన్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కేఆర్ ప్రసాద్, వెంకటరత్నం, సెక్రటరీ కాసాని వేణుగోపాల్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మహబూబ్ బాషా, నర్సింగ్ సూపరింటెండెంట్ నవ్య పాల్గొన్నారు.

# సమస్యల బస్టాండ్

- ప్రయాణికులను వేధిస్తున్న తాగునీరు, మూత్రశాలలు
- ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యల తిష్ఠ
- వసతులు కల్పించాలంటున్న ప్యాసింజర్లు



బస్టాండ్‌లో సరైన సౌకర్యాలు లేక కూర్చుని, నిలబడి ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు

ఇబ్రహీంపట్నం రూరల్, ఫిబ్రవరి 11 : ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రయాణికులు మంచి నీటి సమస్యతోపాటు చాలీచాలని మూత్రశాలలు, మరుగుదొడ్లతో ఇబ్బంది పడుతున్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి ఇటీవల బస్టాండ్ సామర్థ్యాన్ని అధికారులు పెంచారు. ప్రతిరోజూ ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు 50 వేల నుంచి 80 వేల వరకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరందరికీ కూర్చునేందుకు వసతితోపాటు మంచి నీరు, సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రతినెలా లక్షల్లో ఆదాయం వస్తున్నప్పటికీ ప్రయాణికులకు ఆర్టీసీ అధికారులు సరైన సౌకర్యాలు కల్పించడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఈ బస్టాండులో తీవ్రమైన మంచినీటి సమస్య నెలకొన్నది. తాగునీటి కోసం వేసిన బోరు ఎండిపోయింది. అదనపు బోరు వేయాలని లేని పక్షంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అదేవిధంగా సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని.. ఉన్న మూత్రశాలలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

### బస్టాండ్‌లో వసతులు కల్పించాలి



బస్టాండ్‌కు ప్రతినెలా లక్షల్లో ఆదాయం వస్తున్నా సౌకర్యాలు మాత్రం కల్పించడంలేదు. ఈ బస్టాండు నుంచి ప్రతిరోజూ వేలాది మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వారి సౌకర్యార్థం మంచినీటితోపాటు మూత్రశాలలు, మరుగుదొడ్లను అందుబాటులో ఉంచాలి.

– మడుపు వేణుగోపాల్‌రావు, బీఆర్‌ఎస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి

## వాసవీకన్యకాపరమేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : ఆమనగల్లులోని శ్రీ వాసవీ కన్యాక పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవి ఆత్మార్పణ దినోత్స వాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమంతోపాటు లలితాసహస్రనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు ,అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో రామ్మోహన్, నర్సింహ, శ్రీనివాస్, చంద్రశేఖర్, యాదయ్య, కుమారస్వామి, సత్యం, నర్సింహ, విజయ్, జగన్, శ్రీనివాస్, రవీంద్ర, శ్రీనివాస్, దేవేందర్, పూజారులు దినేశ్, శ్రీనయ్య ఉన్నారు.

## నల్లగొండ సభకు భారీగా తరలాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 : కృష్ణానది జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకునేందుకు మంగళవారం నల్లగొండలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్ కోరారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కృష్ణ బేసిన్ ప్రాజెక్టులను కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ)కి అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కృష్ణా ప్రాజెక్టుల కోసం జరుగుతున్న పోరాటానికి కుల సంఘాలు, మేధావులు, ప్రజలు మద్దతు తెలుపాలన్నారు.



మరకత శివలింగాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ సినీ నటుడు హరీశ్ అన్నారు.ఆదివారం శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామంలో బ్రహ్మ సూత్రం గల మరకత శివలింగాన్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సదానందం, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌రాజు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

– శంకర్‌పల్లి, ఫిబ్రవరి 11

## నేడు బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : బీఆర్‌ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మొదటగా ఇటీవల పదవులు పూర్తి చేసుకున్న సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పాలకవర్గ సభ్యులకు గ్రామ పంచాయతీల వారీగా సన్మాన కార్యక్రమం ఉంటుందని, తదనంతరం కృష్ణాజలాల పరిరక్షణ కోసం నల్గొండలో జరగబోయే చలో నల్లగొండ కార్యక్రమం గురించి చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు, నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గువ్వల బాలరాజు హాజరవుతారని పేర్కొన్నారు.

## ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐగా నాగరాజు



యాచారం, ఫిబ్రవరి11: మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఉన్న హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐగా నాగరాజు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన రామాంజనేయులు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కావడంతో అతడి స్థానంలో స్పెషల్ బ్రాంచ్ నుంచి ఫార్మాసిటీ సీఐగా నాగరాజు విధులు నిర్వహించనున్నాడు. నూతన సీఐగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అతనికి పోలీసు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. నేరాల నియంత్రణకు అన్ని విధాలా కృషి చేస్తానన్నారు.

## సన్మానం

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 11 : చేవెళ్ల మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గాన్ని గ్రామస్తులు, పలువురు నేతలు ఘనంగా సన్మానించారు. ఆదివారం గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ సర్పంచ్ ముత్తంగి రాజశేఖర్, మాజీ ఉప సర్పంచ్ కొల్లగల్ల స్వర్ణలతాభాస్కర్, మాజీ వార్డు సభ్యులు, మాజీ కో ఆప్షన్ సభ్యులు తదితరులను గ్రామస్తులు, నాయకులు శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## పేదలను ఆదుకోవడమే ట్రస్టు లక్ష్యం

కడ్తాల్, ఫిబ్రవరి 11 : కష్టాల్లో ఉన్న పేద ప్రజలను ఆదుకోవడమే రాధా కృష్ణ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని ఏక్వాయిపల్లి గ్రామానికి చెందిన ఈర్లపల్లి సాయమ్మ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ ఆదివారం ఉదయం గ్రామానికి చేరుకొని స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జోగు వీరయ్య, జంగయ్య, పాండు పాల్గొన్నారు.

## మండలాన్ని ఆదర్శంగా తీర్చుదిద్దుతా



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కమ్లీమోత్యానాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 11 : అభివృద్ధిలో కడ్తాల్ మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చుదిద్దుతామని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గ్రామాలు, తండాల్లోని ప్రతి కాలనీల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మండల పరిషత్ నిధులతో మండలంలో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నిర్మల, నాయకులు కాశీనాథ్‌రెడ్డి, యాదయ్య, మధు, నర్సింహ, నారాయణరెడ్డి, సత్యనారాయణ, రమేశ్, సురేశ్, మహేశ్, మోహిన్, మనీశ్‌రెడ్డి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నిల్వ నీటిని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 11: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చేవెళ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇండ్లల్లో పేరుకుపోయిన నీటిని తొలగించినట్లు తెలిపారు. పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది యాదిగిరి, వెంకటయ్య, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి



యాచారం : కరపత్రాలను పంపిణీ చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 11: దేశ వ్యాప్తంగా ఈ నెల 16 తేదీన నిర్వహించే కార్మికుల సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అధ్యక్షతన కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తి అయినా రైతులు, కార్మిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

**యాచారం** : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా జరుగనున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి. మధుసూధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గునగల్, ధర్మన్నగూడ గ్రామాల్లో ఆదివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపీ ప్రభుత్వ తీరును ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పదేండ్లుగా నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా పనిచేసినా ధరలను నియంత్రించడంలో విఫలమయ్యారన్నారు. విదేశాల పర్యటనలు తప్ప దేశాభివృద్ధికి ఆయన ఒరగబెట్టిందేమీలేదన్నారు. అధికారంలోకి వస్తే నల్లధనం వెలికితీసి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాల్లో పదిహేను లక్షలు వేస్తానన్న మోదీ.. కనీసం పది రూపాయలు కూడా వేయలేదన్నారు. అదానీ, అంబానీలకు ఇచ్చే ప్రాముఖ్యత ప్రజలకివ్వడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, మల్లేశ్, జంగయ్య, శ్రీశైలం, రాములు తదితరులున్నారు.



చేవెళ్లటౌన్: రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

## మూగజీవాల తరలింపు : నిందితులపై కేసు నమోదు

ఆమనగల్లు, ఫిబ్రవరి 11 : బొలెరో వాహనంలో మూడు లేగదూడలు, ఆవును బంధించి తరలి స్తున్న వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూగజీవాలను స్వాధీనం చేసుకుని గోషాలకు తరలించారు. ఎస్‌ఐ బాల్‌రామ్ కథనం ప్రకారం.. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం వాహనాల తనిఖీల్లో భాగంగా కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ బొలెరో వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా మూడు చిన్న లేగ దూడలు, పెద్ద ఆవు ఉన్నట్లు గుర్తించి.. ఆ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. బాలానగర్ మండలంలోని అమ్మపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ రవి హైదరాబా ద్‌లోని సబ్జీ మండికి చెందిన అబ్దుల్ మతిన్ ఇద్దరు కలిసి ఆవులను కల్వకుర్తి నుంచి తుక్కుగూడకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. పశువైద్యాధికారి ధ్రువీకరించిన సర్టిఫికెట్ లేకుండా చిన్న ట్రాలీ బొలెరోలో బంధించి తీసుకెళ్లడంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ మూగజీవాలను నాగర్‌కర్నూల్ జిల్లాలోని గురునానక్ గోషాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.


### కనకదుర్గానగర్ అధ్యక్షుడిగా జంగారెడ్డి

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 11: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు కనకదుర్గానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏ జంగారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, సలహాదారుగా మల్లికార్జున్, జనరల్ సెక్రటరీగా ఎస్ రఘునాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ వెంకన్న, డిప్యూటీ సెక్రటరీ ఎస్ దామోదర్‌రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ ఏ సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

### విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 11: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్ గ్రామంలోని ఓ ఇంట్లో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్విచ్‌బోర్డులో మంటలు చెలరేగి, ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. ఇంట్లో ఉన్న విజయలక్ష్మి అనే వృద్ధురాలు అప్రమత్తమై.. వెంటనే ఇతర పోర్షన్లలోని యజమానులకు చెప్పింది. అంతా బయటకు వచ్చారో లేదో.. ఇంట్లోని సిలిండర్ పేలిపోయి భారీగా మంటలు చెలరేగాయి. ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

## మహేశ్‌యాదవ్‌కు సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు




మొయినాబాద్, ఫిబ్రవరి 11: సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందున్న మండలంలోని నజీబ్ నగర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ సోమ మహేశ్‌యాద వ్‌కు సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డు వరించింది. గ్రామంతోపాటు వివిధ ప్రాంతాల్లో సేవా కార్య క్రమాలు చేస్తుండడంతో ఆయన సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బహుజన సాహిత్య అకాడమీ వారు సర్వీస్ సొసైటీ అవార్డుకు ఎంపిక చేయగా ఆదివారం తిరుపతిలో జరిగిన కార్య క్రమంలో అకాడమీ జాతీయ నాయకుడు రాధాకృష్ణ చేతుల మీదుగా మహేశ్‌యాదవ్ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్ అలియాస్ గౌతం తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మహేశ్‌యాదవ్ మాట్లాడుతూ నేషనల్ అవార్డు రావడంతో నాపై మరింత బాధ్యత పెరిగిందని.. సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తానన్నారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్



వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 11: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కౌన్సిలర్ లతాశ్రీ, ఎంఈవో శంకర్‌రాథోడ్ అన్నారు. షాద్‌నగర్‌లోని మదర్ థెరిస్సా పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం నిర్వహించిన పాఠశాల 19వ వార్షికోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాంటెండెంట్ శ్యామ్‌కుట్టి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హజ్రత్ మౌలాలి దర్గా ఉత్సవం



షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 11: ఫరూఖ్‌నగర్ మండలంలోని చించోడ్ గ్రామ పంచాయతీలో గల హజ్రత్ మౌలాలీ దర్గా 14వ ఉర్సు ఉత్సవాలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం దర్గా ఉత్సవాలను అత్యంత పవిత్రంగా ఇక్కడ నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. మొదటిరోజు సందర్భంగా గంధోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం




అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 : అనాజ్‌పూర్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. గ్రామపంచాయతీ పక్కనే ఉన్న నివాస భవనం మొదటి అంతస్తులో కోటగిరి విజయలక్ష్మి నివాసం ఉంటున్నది. అగ్ని ప్రమాదం కారణంగా ఇంట్లోని వస్తువులు, నగదు అన్ని మంటల్లో బూడిదయ్యాయి. ప్రభుత్వం తక్షణ సహాయం కింద ఇచ్చే పరిహారంలో భాగంగా తహసీల్దార్ రవీందర్ దత్తు ఇచ్చిన రూ. 5 వేల నగదను పంచాయతీ కార్యదర్శి రాజేశ్ బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, బాలకృష్ణ, సురేశ్, మండలి సత్తయ్య, ఏర్పుల సామయ్య, కండెగాని మహేందర్, ఏర్పుల నిరంజన్, ప్రవీణ్ పాల్గొన్నారు.